అడుగంటిన బోర్లు.. ఎండుతున్న పైర్లు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: వర్షాకాలం సీజన్ సైతం వేసవిని తలపిస్తుంది. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరిగి సాగునీటి వనరులు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో రైతుల ఆశలు ఆవిరి అవుతున్నాయి. బోర్లు, బావుల్లో నీరు ఉందనే ఆశతో నాట్లు వేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఎలాగైనా పది రోజులకు ఒకసారి వర్షం పడుతుందనే నమ్మకంతో పాటు బోర్లు, బావుల్లో ఉన్న నీటిని అంచనా వేసి నాట్లు వేసుకున్నారు. తర్వాత వర్షం ముఖం చాటేసి సూర్య ప్రతాపం పెరగడంతో నీటి ఊట తగ్గింది. ఇప్పుడు బావుల్లో నీటి నిల్వలు పడిపోయాయి. బోర్లలో భూగర్భ జలం తగ్గిపోయింది. ఎండలు సాధారణం కంటే 3, 4 డిగ్రీలు ఎక్కువగా ఉంటుంది. వరి పైర్లు ఎండిపోతుండటంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. ఎండలు ఇలాగే ఉండి వారం పది రోజుల్లో నీరు విడుదల కాకపోతే 30 శాతం పంటలు ఎండిపోతాయి. ఆలస్యమైతే మరికొంత పంట నష్టం తప్పదని రైతులు, క్షేత్రస్థాయిలో అధికారులు పేర్కొంటున్నారు.

కళ్లు మూసుకుని.. నీళ్లు తాగాలి!

రోజూ వెయ్యికి పైగా ఓపీ ఉండే సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రిలో కనిపించిన దృశ్యమిది. తాగునీటి యంత్రాల వద్ద పారిశుద్ధ్యం లోపించింది. ఆవరణలో ఏర్పాటుచేసిన తాగునీటి పరికరం వద్ద వృథానీరు వెళ్లడానికి సరైన వసతి లేక చుట్టూ నిలిచి బురదగా మారుతోంది. వార్డుల్లోని తాగునీటి యంత్రాలను శుభ్రపరిచే వారు లేక దుర్గంధభరితంగా తయారయ్యాయి.

గత్యంతరం లేక ప్రజలు అందులోని నీటినే తాగుతున్నారు. గ్లాసులు కూడా కింద పడుతున్నాయి. పలు రకాల వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్న ప్రజలకు ఇక్కడి పరిసరాలు మరింత ఇబ్బంది కలిగిస్తున్నాయి. పర్యవేక్షణాధికారులు తాగునీటి పరికరాలతోపాటు పరిసరాల శుభ్రతపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

–ఈనాడు, నల్గొండ, న్యూస్‌టుడే, భానుపురి

కన్పించని చెట్లు.. నిబంధనలకు తూట్లు

- పురాల్లో నూతన నివాసాల్లో నాటని మొక్కలు

సూర్యాపేటలోని ఓ వీధిలోని ఇళ్లలో నాటని మొక్కలు

సూర్యాపేట పురపాలిక, నేరేడుచర్ల, తిరుమలగిరి, కోదాడ పట్టణం, హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నా.. అధికారులు అలసత్వం వహిస్తున్నారు. నూతన నిర్మాణాలకు అనుమతులు పొందే ముందు విధిగా మొక్కలు నాటాలనే నిబంధన ఉన్నా..పుర సిబ్బంది పట్టించుకోవడం లేదు. కొత్త నివాస గృహాలు, భవంతులు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల ఆవరణలు, ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట పచ్చదనం పెంచాలి. దీన్ని సక్రమంగా అమలు చేస్తూ పర్యవేక్షించాల్సిన పుర అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పురపాలికల్లో ఎక్కడ ఇళ్లు నిర్మిస్తున్నారో అధికారులు, సిబ్బందికి తెలియడం లేదు. వీటిపై పర్యవేక్షణ చేపట్టాల్సిన సిబ్బంది తమ కేమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పరిశీలన

కొత్త భవనాలు ఇలా..

సూర్యాపేటలోని 48 వార్డుల్లో ఈ ఏడాది 391 కొత్త భవనాలు నిర్మాణం చేపడుతున్నారు. వీటిలో పుర అధికారులు మొక్కలు నాటుతున్నారా లేదా తనిఖీ చేయాల్సి ఉంది. కోదాడలో 35 వార్డులలో 276, హుజూర్‌నగర్‌లో 28 వార్డులకు 193, తిరుమలగిరి 15 వార్డుల్లో 81, నేరేడుచర్లలో 15 వార్డులు ఉండగా 91 కొత్త నివాసాలు నిర్మాణం చేపడుతున్నారు. కానీ ఎక్కడా మొక్కలకు స్థలం కేటాయించడం లేదు.

పరిశీలన సున్నా..:

పురపాలికల్లో నూతన భవనాలు నిర్మించుకొనే సమయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తుంటారు. ఆమోదించే సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలి. మొక్కలు నాటేందుకు స్థలం వదలకుండానే నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. పచ్చదనం పెంపొందించే విషయంలో ప్రభుత్వ ఆశయం అమలు కావటం లేదు. నిర్మాణాల వద్ద విస్తీర్ణానికి అనుగుణంగా కనీసం నాలుగు మొక్కలైనా నాటాలి. 300 గజాలు ఉంటే ఎనిమిది మొక్కలు ఉండాలి. ఈ విషయాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించాలి. పచ్చదనం లేకుంటే ఆక్యుపెన్సీ ధ్రువీకరణ ప్రతం ఇవ్వొద్దు. ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి.

మొక్కలు పెంచాలి: హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లో నూతన భవన నిర్మాణదారులు మొక్కలను పెంచాలి. అనుమతుల సమయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తప్పకుండా పరిశీలన చేపట్టాలి. ఇక నుంచి మొక్కలు పెంచే విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. లేని పక్షంలో అనుమతులు రద్దు చేస్తాం.

సన్నాలకు కన్నాలు..!

- చౌకబియ్యం బస్తాల్లో కిలోల కొద్దీ తేడా

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ఎంఎల్ఎస్‌పీ (మండల లెవల్ స్టాక్ పాయింట్) నిర్వాహకులు అంతా మా ఇష్టం.. అడిగితే మీకే నష్టం అనే విధంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ బియ్యం సరఫరాలో తరుగు భారీగా వస్తుండటంతో డీలర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వారు తరుగును పూడ్చుకోవడానికి కొన్ని తప్పులు చేయక తప్పడం లేదు. ఇదంతా ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి అధికారి వరకు తెలిసిన బహిరంగ విషయమే.

భారీగా తరుగుదల..:

చౌకధరల దుకాణానికి సన్నబియ్యం చేరవేయడానికి రెండు దశలు ఉంటాయి. ఎఫ్‌సీఐ నుంచి ఏ వన్ గుత్తేదారు బియ్యం రవాణా చేస్తారు. అక్కడ వేబ్రిడ్జిలో బస్తా 50.650 కిలోల ప్రకారం తూకం వేసి లారీ లోడ్ చేస్తారు. (50 కిలోల బియ్యం, 650 గ్రా. బస్తా). అక్కడ నుంచి నేరుగా స్టాక్ పాయింట్ వద్దకు వస్తుంటాయి. ఒకవేళ ఎఫ్‌సీఐలో తరుగు కనిపిస్తే అదనంగా ఎంత తక్కువ తూకం ఉంటే అంతే మొత్తానికి సరిపడా బస్తాలు ఇస్తారు. స్టాక్ పాయింట్ల వద్ద దిగుమతి చేసిన అనంతరం ఇక్కడ నుంచి డీలర్లకు వేరే గుత్తేదారు ఉంటారు. అక్కడ సైతం డీలర్లకు ఇదే పద్ధతిలో లారీలో ఎత్తి వేబ్రిడ్జి పెట్టి ఇవ్వాలి. ఇక్కడ అలా పెట్టి ఇవ్వడం లేదు.

వేబ్రిడ్జిలేవ్:

గరిడేపల్లి మండలలో ఓ డీలరు వద్ద 50 కిలోల బియ్యం బస్తా తూకం 47.860 కిలోలు

మరో డీలరు వద్ద 44.330 కిలోలు..

చాలా చోట్ల స్టాక్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలు లేవు. పెద్ద కాంటాలపై బస్తాలు తూకం వేసి డీలరు వేలిముద్ర వేసి సరి చూసుకుని తెచ్చుకోవాలి. బస్తాల వారీగా తీస్తే బస్తాకు 1-3 కిలోల వరకు తరుగు వస్తుంది. సగటున 100 బస్తాల బియ్యం డీలరు తెచ్చుకుంటే అందులో 20-25 బస్తాల్లో 50 కిలోలు ఉంటాయి. మిగతా బస్తాల్లో 45, 46, 47, 48, 49 కిలోలు ఉంటున్నాయి. దీనిపై జిల్లా అధికారులకు డీలర్లు మొరపెట్టుకుని విసిగిపోయి తరుగును సరి చేసుకుంటున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

– శ్రీనివాసరెడ్డి ఏఎస్‌వో, సూర్యాపేట

డీలర్లు స్టాక్ పాయింట్ వద్ద తూకం వేసుకొని లారీలో లోడు చేయించుకుని దిగుమతి అయ్యే వరకు ఉండాలి. అలా చేసినా తక్కువ వస్తుందంటే ఫిర్యాదు స్వీకరించి విచారణ చేసి ఎక్కడ లోపం ఉందో గుర్తించి చర్యలు తీసుకుంటాం.

వేల క్వింటాళ్లు పక్కదారి..

జిల్లాలో 3,70,147 కార్డులు ఉండగా 10,77,583 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. వీరికి నెలకు ఆరు కిలోల చొప్పున 2,05,15,416 కిలోలు సరఫరా చేస్తున్నారు. అంటే 50 కిలోల బస్తాలు 4,10,308. వీటిలో 30 శాతం 50 కిలోలు ఉంటున్నా మిగతా 2,87,216 బస్తాల్లో తరుగు ఉంటుందని డీలర్లు స్పష్టంగా చెబుతున్నారు. సగటున రెండు కిలోల తరుగు ఉన్నా 5,74,432 కిలోల బియ్యం మాయం అవుతుంది.

విముక్త జాతుల దినోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ పవార్

విముక్త జాతుల అభ్యున్నతికి ప్రాధాన్యం: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమాజంలో వెనుకబడిన విముక్త జాతుల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన విముక్త జాతుల దినోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చారిత్రక కారణాల వల్ల తీవ్ర అణిచివేతకు గురైన ఈ వర్గాలకు సామాజిక భద్రతతోపాటు ఆర్థిక పరిపుష్టి కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అదనపు కలెక్టర్ హరిసింగ్, జడ్పీ సీఈవో శిరీష, బీసీడీవో విశాల్, కౌన్సిలర్ ఊర రామ్మూర్తి, నాయకులు లింగయ్య, వెంకటేశ్వర్లు, వెంకట్, శ్రీరాములు పాల్గొన్నారు.

- కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. వివిధ శాఖలకు మొత్తం 70 ఫిర్యాదులు అందాయి.

ఏసీటీవో సస్పెన్షన్!

కోదాడ, న్యూస్‌టుడే: కోదాడ వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలోని ఓ అధికారిపై సస్పెన్షన్ వేటు పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని జీఎస్టీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏసీటీవో(అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్) రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఇటీవల ఆ శాఖకు చెందిన కొంతమంది జీఎస్టీ పేరిట వ్యాపారుల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీనిపై కోదాడ వాణిజ్య పన్నుల శాఖ అధికారి యాదగిరిని చరవాణిలో వివరణ కోరగా.. అందుబాటులోకి రాలేదు.

నీరు చేరక.. మీనాలు వదలక

- అడుగంటుతున్న జలవనరులు
- ఆందోళనలో మత్స్యకారులు

నీటినిల్వలు లేక ఎండిపోయిన కనగల్ మండలంలోని కురంపల్లి చెరువు

ఈనాడు, నల్గొండ: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆశించిన వర్షాలు లేకపోవడంతో చెరువులు దాదాపుగా అడుగంటాయి. చేపల ఉత్పత్తికి కావాల్సిన నీటినిల్వలు లేవు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూసీ, సాగర్ పరివాహక చెరువుల్లో నీటినిల్వలు కొద్దిమేర మాత్రమే ఉన్నాయి. మునుగోడు, కనగల్, చండూరు, దేవరకొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, చిట్యాల, చౌటుప్పల్, భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల్లో చెరువుల్లో వరద నీరు చేరకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదించిన చేప పిల్లల పరిమాణం, పంపిణీ లక్ష్యం(లక్షల్లో)

జిల్లా	35-40 ఎం.ఎం.	చెరువులు	80-100 ఎం.ఎం.	చెరువులు
నల్గొండ	178.02	956	420.16	211
యాదాద్రి	141.75	511	140.41	150
సూర్యాపేట	976.78	431	243.50	190

నష్టపరిహారం అందించాలి

కనుకు వెంకటనారాయణ, నల్గొండ జిల్లా మత్స్య శాఖ జిల్లా ఛైర్మన్

గతేడాది పంపిణీ చేసిన చేప పిల్లలు

ఎల్‌నినో కారణంగా మూసీ, సాగర్ పరివాహక ప్రాంతంలోని పెద్దచెరువుల్లో మినహా ఎక్కడా నీటి నిల్వలు సమృద్ధిగా లేవు. చేపలు వృద్ధి చెందాలంటే నీటి నిల్వలు ఎక్కువగా ఉండాలి. నిల్వలు సరిగా లేకనే ఉచిత చేపపిల్లల పంపిణీ ఉండదని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులకు ఉపాధి కరవైన నేపథ్యంలో ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

నిల్వలు పెరిగితేనే సరఫరా

–సుకీర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి, నల్గొండ

జలాశయాల్లో నీటినిల్వలు తగ్గిపోవడంతో ఈసారి చేపల పిల్లల విడుదల ఆలస్యం కానుంది. అంతా సిద్ధంగా ఉన్నా గుత్తేదారులు నీటి నిల్వల గురించి ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడి నీరు సమృద్ధిగా చేరితేనే పంపిణీ చేస్తాం.

చేపపిల్లల పంపిణీ ఆలస్యం

- నల్గొండ జిల్లావ్యాప్తంగా 1,167 చెరువుల్లో 5.98 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యంగా టెండర్లు పిలిచినా జలాశయాల్లో నీరు లేని కారణంగా సరఫరా ప్రక్రియ వాయిదా వేశారు. గుత్తేదారులు సైతం ముందుకు రావడం లేదు.
- సూర్యాపేట జిల్లాలో 621 చెరువుల్లో 3.41 కోట్ల మేరకు వదలాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. కనీస నీటినిల్వలు లేక అధికారులు పంపిణీకి వెనుకంజ వేస్తున్నారు.
- యాదాద్రి జిల్లాలో 661 చెరువుల్లో 2.81 కోట్ల చేప పిల్లలను వదలాలని అనుకున్నా నీటి లభ్యత తక్కువగా ఉండటంతో వాటిని సరఫరా చేసేందుకు ముందుకు రావడం లేదు.

చేయి తడిపితే చేయూత!

- జిల్లా వ్యాప్తంగా 19,658 దరఖాస్తులు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: చేయూత పింఛన్ల దరఖాస్తుకు సోమవారం గడువు ముగియగా.. ఇంకా దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు ఉండటంతో ఈ నెల 15 వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం వరకు 19,658 మంది దరఖాస్తు చేసుకోగా అందులో అత్యధికంగా వితంతువు, దివ్యాంగుల విభాగానికి చెందినవే. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం కంటే అత్యధికంగా దరఖాస్తులు రావడంతో వడపోసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అర్హులను గుర్తించేందుకు నేటి నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వార్డుల్లో బిల్ కలెక్టర్లు విచారణ చేపట్టనున్నారు. వీరి అనంతరం ఎంపీడీవోలు సైతం క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే అర్హులను గుర్తించనున్నారు.

పైరవీకారులు వచ్చేశారు..

జిల్లా వ్యాప్తంగా వచ్చిన 19,658 దరఖాస్తుదారులపై గెజిటెడ్ అధికారుల ఆధ్వర్యంలో విచారణ జరగనున్నట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్లకు ఏ తరహాలో విచారణ చేసి అర్హులను గుర్తిస్తున్నారో అదే తరహాలో పింఛన్ అర్హులను గుర్తించనున్నారు. భూములు, వాహనాలు, అర్హత, కుటుంబ ఆర్థిక పరిస్థితి, కుటుంబ సభ్యుల ఉద్యోగ స్థితిగతులు, తదితర అంశాలను పరిగణలోకి తీసుకోనున్నారు. ఇదే అదునుగా భావించిన పైరవీకారులు పింఛన్ వచ్చేలా చూస్తామని వారి ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతున్నారు. గ్రామీణ, వార్డు స్థాయి నుంచి పైస్థాయి అధికారులకు ముట్టజెప్పాలని మాయమాటలు చెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వారు కూడా పింఛన్ వస్తుందని ఆశతో అయిదు నెలల పింఛన్ పోయినా పర్వాలేదని, జీవితకాలం పింఛన్ వస్తుందనే ఆశతో అడిగినంతా ఇచ్చేందుకు వెనకాడటం లేదని తెలుస్తోంది. వీరికి కొందరు అధికారులు సైతం సహకరిస్తున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అర్హులను గుర్తించి, పారదర్శకంగా ఎంపిక చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో 'చేయూత' దరఖాస్తుల వివరాలు

వితంతువు	9,957
ఒంటరి మహిళ	2,033
దివ్యాంగ	4,440
చేనేత	370
గీత కార్మికులు	2,858

రుణం.. వరం

- నేటి నుంచి పురాల్లో 'లోక్ కల్యాణ్ మేళా'

చేపట్టనున్న కార్యక్రమాలు

➡ పీఎంస్వనిధి రుణాలకు అర్హత కలిగిన వీధి వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పించడం. ➡ పెండింగ్ రుణ దరఖాస్తులకు సంబంధించి బ్యాంకులతో సమన్వయం చేసి పెండింగ్‌లో ఉన్నవి పరిష్కరించడం. ➡ సకాలంలో రుణాలు పంపిణీ అయ్యేలా చూడటం. ➡ వీధి వ్యాపారులు డిజిటల్ పేమెంట్స్ వినియోగించేలా అవగాహన. ➡ డిజిటల్ చెల్లింపులకు క్యూఆర్‌కోడ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టడం. ➡ అర్హత కలిగిన వీధి వ్యాపారులను గుర్తించి అవసరమైన వివరాల నమోదు. ➡ టీపీసీ/టీఎల్‌బీసీ సమావేశాల ద్వారా బ్యాంకు రుణాల సమస్యలను పరిష్కరిస్తారు. ➡ మెప్మా చేపట్టే కార్యక్రమాలు, రుణాలపై ప్రచారం చేపట్టడంతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: వీధి వ్యాపారులకు రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తోంది. దరఖాస్తు చేసుకోనివారు ఇప్పటివరకు మొదటి విడత రుణాలు కూడా తీసుకోని వారికి సెప్టెంబరులో మంజూరు చేసేందుకు నెలరోజులపాటు 'లోక్ కల్యాణ్ మేళా' పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు జిల్లాలోని ఐదు పురపాలికల్లో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ఐదు మున్సిపాలిటీల్లో 14,880 మంది వ్యాపారులు ఉండగా, 11,821 మందికి మంజూరు చేశారు. ఇంకా 3,103 మంది పొందనివారున్నారు.

మున్సిపాలిటీల్లో వీధివ్యాపారులు, దరఖాస్తులు అందించిన వారు, రుణం మంజూరైన వారి వివరాలు..

పురం	వ్యాపారులు	అర్జీలు	మంజూరు
సూర్యాపేట	6848	5300	5,186
కోదాడ	4216	3361	3225
హుజూర్‌నగర్	2006	1737	1729
తిరుమలగిరి	980	969	949
నేరేడుచర్ల	830	702	688

వేగవంతంగా రుణాలు

సీహెచ్ హన్మంతరెడ్డి, మెప్మా పీడీ, సూర్యాపేట

మెప్మా సిబ్బంది ద్వారా వీధి వ్యాపారులకు వేగవంతంగా రుణాలు మంజూరు జరిగేలా చర్యలు చేపడతాం. అర్హులైన వీధి వ్యాపారులను గుర్తించి మంజూరు అయ్యేలా చూస్తాం. లోక్ కల్యాణ మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

తెరచుకున్న పైకప్పు.. తొలగని ముప్పు

హైదరాబాద్-విజయవాడ హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా..రహదారి భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనడానికి పైచిత్రమే నిదర్శనం. సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 65పై జనగామ చౌరస్తా సమీపంలో ప్రమాదం పొంచి ఉంది. హైవేపై నిర్మించిన నాలాపై ప్రయాణికుల రక్షణార్థం వేసిన సిమెంటు పలకల పైకప్పు చాలాచోట్ల ధ్వంసమైంది. దీని పక్కనుంచే వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా భారీ ప్రమాదం తప్పదు.

–ఈనాడు, నల్గొండ, న్యూస్‌టుడే, సూర్యాపేట పురపాలిక

ప్రజాభద్రత పోలీసు ప్రథమ కర్తవ్యం: ఎస్పీ

డీఎస్పీ కార్యాలయంలో దస్త్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్పీ దర్యాప్తు అధికారిగా వ్యవహరించే అట్రాసిటీ, తీవ్రమైన చీటింగ్, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ నరసింహ తెలిపారు. పోలీసు కార్యాలయాల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వివిధ దస్త్రాలను పరిశీలించారు. డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజశేఖర్, వెంకటయ్య, ఎస్సైలు యాదవేందర్‌రెడ్డి, మహేశ్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

- జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు.

నేటి నుంచి పోలీస్ యాక్ట్: జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు.



ITI SPOT ADMISSIONS

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారం సం॥రమునకు రూ. 16,500/- మాత్రమే. ఈ క్రింది కోర్సులలో ప్రవేశం గలదు. 1) ఫిట్టర్, 2) ఎలక్ట్రానిక్ మెకానిక్ 3) ఎలక్ట్రీషియన్ 4) ప్లంబర్ 5) డిజిల్ మెకానిక్. 6) డ్రాఫ్ట్‌మెన్ సివిల్.
నోట్: COPA (కంప్యూటర్) కోర్సు 1 సం॥కు రూ. 13,200/-లు మాత్రమే.

చివరి తేది: 05-09-2026

మార్కోని ITI, నల్లగొండ
శ్రీ శారద ITI, మిర్యాలగూడ
Cell: 98482 45036, 94900 97071, 94404 05112

యువ సంకల్పం..కొలువులకు సన్నద్ధం

ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సాంకేతిక విద్య గురించి శిక్షణ ఇస్తున్న నేతాజీ

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: పూసపాటి నేతాజీ. వయస్సు మూడు పదుల్లోపే..ఇంజినీరింగ్ పట్టా రాకముందే స్టార్టప్ కంపెనీల స్థాపన. ఇతడి టీం 92 మంది. ఇంజినీరింగ్ విద్య పూర్తయ్యేలోగా విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయడమే ఈ యువకుడి సంకల్పం. మరిన్ని విషయాలు అతడి మాటల్లోనే..

❑ నాన్న రమేష్ పెయింటర్ కమ్ ఆర్ట్ టీచర్ (మేళ్లచెరువు జడ్పీహెచ్ఎస్). అమ్మ పద్మ మిర్యాలగూడ మోడల్ స్కూల్ టీచరు. వారికి నేను, చెల్లి సంతానం. పది వరకు మేళ్లచెరువులోనే చదివాను. 2025లో సీఎంఆర్ కాలేజీలో బీటెక్ (సీఎస్ఈ) పూర్తి చేశాను. ఇంజినీరింగ్ తర్వాత చాలామందికి నైపుణ్య లోపంతో ఉద్యోగం రావడం లేదు. ఇలా కాదని నా ఆలోచనతో ఫస్ట్ ప్రొఫైల్ ఆప్టిమైజేషన్ అనే పాయింట్‌లో బీటెక్ తృతీయ సంవత్సరంలోనే ట్రయల్‌బ్లిజ్ (టీఆర్ఏఐఎల్‌బీఎల్ఐజడ్) అనే స్టార్టప్ కంపెనీ ప్రారంభించాను. రిజిస్టర్ నేమ్. . నిరుద్యోగ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్. స్టార్టప్‌తో నెలకు రూ. 30-40 వేలు.

❑ తెలంగాణ, ఏపీ మొత్తం కలిపి 20 పైగా ఇంజినీరింగ్ కాలేజీల్లో ట్రైనింగ్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ పేరుతో తరగతులు ప్రారంభించా. మల్లారెడ్డిగ్రూప్స్, సీఎంఆర్ వంటి హైదరాబాద్‌లోని టాప్ కాలేజీల్లో 2024 నుంచి శిక్షణ ఇస్తున్నాం. ఐఐఏటీ పేరుతో కొత్తగా వచ్చిన సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోనూ నాలెడ్జ్ పార్టనర్‌గా 65 శాతం షేర్ హోల్డింగ్ తీసుకున్నా.

❑ ప్రస్తుతం ఇంజినీరింగ్ విద్య, ఇండస్ట్రీకి చాలా గ్యాప్ ఉంది. కంపెనీలు తమకు స్టాండర్డ్ విద్యార్థులు దొరకటం లేదని, విద్యార్థులు తమ టాలెంట్‌కు ఉద్యోగం ఇవ్వడం లేదంటున్నారు. దీనిని సరి చేయడానికి ఐఐఏటీని ప్రారంభించాం. భిన్నంగా మొదటి బెంచ్ వదిలేసి చివరి బెంచ్‌పై దృష్టి సారించాం. టాప్ కాలేజ్‌తో పాటు గ్రేడ్ 2, 3 కళాశాలలను ఎంచుకున్నాం. విద్యార్థులు ప్రాక్టికల్ ఇష్టపడుతుండటంతో మా బృందం ప్రాక్టికల్‌గా సిద్ధం చేస్తుంది.

అడ్మిషన్ దగ్గరి నుంచి పూర్తిస్థాయిలో ఇండస్ట్రీల కోర్సులు డిజైన్ చేసి ఇండస్ట్రీ రిలేటెడ్ పర్సన్లతోనే క్లాసులు నడిపిస్తున్నాం. రూ.లక్షతో చేసే శిక్షణను రూ.10 వేలలో అందిస్తా. జాబ్ కంటే నాలాగా కష్టపడితే నెలకు స్టార్టప్‌తో రూ.30-40 వేలు సంపాదించొచ్చు.

❑ ఈ ఏడాది 365 కంపెనీలతో ఎంఓయూ చేసుకున్నాం. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ప్రాక్టికల్ అందిస్తున్నాం. ప్రాజెక్టులు ఐబీఎం నుంచి ఉంటాయి. మా శిక్షణ తర్వాత ఇంటర్న్‌షిప్‌లో సీమెన్స్, మైక్రోసాఫ్ట్ లాంటి పెద్ద కంపెనీలకే వెళ్తున్నారు. ప్రస్తుతం డిగ్రీ కంటే స్కిల్ ఎక్కువ చూస్తున్నారు. మా దగ్గర డిగ్రీ బీసీఏ, ఎంసీఏ చేసిన వారు ఉన్నారు. నాలుగేళ్ల కోర్సును మూడున్నరేళ్లకు కుదించాం. విద్యార్థులు రెండున్నరేళ్లకు క్యాంపస్‌లో ఉంటారు. రాయదుర్గం మెట్రో స్టేషన్, అమీర్‌పేట్‌లో మా కార్యాలయాలు ఉన్నాయి.

केनरा बैंक Canara Bank — Syndicate

కోదాడ శాఖ, ప్లాట్ నెం. 19 నుండి 22, టౌన్ సెంటర్ ప్లాజా, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, భవాని నగర్, కోదాడ, సూర్యాపేట జిల్లా - 508206.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూలు 3తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన.

దిగువ తెలిపిన రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదార్లు బ్యాంకు నుండి పొందిన రుణ సదుపాయాల అసలు మరియు వడ్డీ తిరిగి చెల్లించుటలో విఫలమైనారని ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు సదరు రుణాలు నిరర్థక ఆస్తులు (NPA)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారి చివరిగా తెలిసిన చిరునామాలకు నోటీసులు జారీచేయబడినవి. అయితే, అవి అందచేయబడక తిరిగి వచ్చినవి. కనుక వారికి ఈ బహిరంగ ప్రకటన రూపంలో ఇందుమూలముగా తెలియజేయడమైనది.

రుణగ్రహీత పేరు/ ఎన్‌పిఏ తేది	స్థిరాస్తుల వివరం	బకాయి మొత్తం
రుణగ్రహీత: శ్రీ మద్దెల సునీల్ కుమార్, తండ్రి బాలస్వామి, ఇంటి నెం. 4-38, ఆర్.సి ఎం చర్చ్ సమీపాన, కొమరబండ, కోదాడ, సూర్యాపేట-508206. ఎన్‌పిఏ తేది: 28.08.2026	కోదాడ సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం, కోదాడ మున్సిపాలిటీలోని రెవెన్యూ ఆవెన్యూలో బ్లాక్ నెం 18, సర్వే నెం.లు 235/2, 236/1ఎ, 236/1ఎ2, 236/1/ఎ, 236/1/సి/బి, 236/2ఎ, 235/బి, 235/3, 224/1, 224/2, 237/1ఎ, 237/1బి, 237/1సి, 237/1, 224/1ఎ, 224/3ఎ, 224/1బి, 224/3బి, 236/1/ఎ3 మరియు 236/1/ఎ4 లోని 200 చ.గజాల (1213.50 ఆర్‌సిసి చ.అ) విస్తీర్ణంలోని ప్లాట్ నెం.216లో ఆర్‌సిసి రూఫ్ నివాస ఇల్లు యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.215లో ఇల్లు, **దక్షిణం:** ప్లాట్ నెం.217లో ఇల్లు, **తూర్పు:** ప్లాట్ నెం.196లో ఇల్లు, **పడమర:** 30 అ.మున్సిపాలిటీ రోడ్. CERSAI ID: 400057071897.	రూ.27,64,436.22/- (ఇరవై ఏడు లక్షల అరవై నాలుగు వేల నాలుగు వందల ముప్పై ఆరు రూపాయల ఇరవై రెండు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, అనుసంగిక ఖర్చులు మరియు వ్యయాలు.

నోటీసును అందజేయుటకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయబడుచున్నవి. పైనతెలిపిన రుణగ్రహీతలు మరియు/లేదా వారి గ్యారంటర్ల (వర్తించినప్పుడు)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోపు పైనతెలిపిన బకాయిని మీరు తిరిగి చెల్లించవలెను. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల తర్వాత తదుపరి చర్యలు చేపట్టబడును.

తేది: 31.08.2026, ప్రదేశం: కోదాడ — సం/-, అధీకృత అధికారి

(c) eenadu

ఆధునిక సాగుతో అధిక దిగుబడులు

మల్చింగ్ పద్ధతిలో మిరప సాగు

రైతేరాజు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: నీటి పొదుపు, కలుపు నియంత్రణ, నాణ్యమైన దిగుబడులు, రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త సీహెచ్.నరేష్ సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి కొరతను అధిగమించి సాగు ఖర్చులు తగ్గించుకోవడం, కూలీల కొరతను తట్టుకోవడం, కలుపు మొక్కలను నియంత్రించడం ముఖ్యం. వీటితో పాటు తెగుళ్ల ఉద్ధృతిని అరికట్టాల్సిన అవసరం ఉంది. ఉద్యాన పంటల్లో ప్లాస్టిక్ మల్చింగ్, షేడ్‌నెట్, నెట్ హౌస్, పాలిహౌస్ రక్షిత సాగు పద్ధతులను శాస్త్రీయంగా వినియోగిస్తే నీరు ఆదా చేయవచ్చు. కలుపు నియంత్రణ, పంట నాణ్యత, అధిక దిగుబడులు మెరుగు పర్చుకోవచ్చు.

షేడ్‌నెట్‌తో మొక్కలకు రక్షణ..

అధిక ఉష్ణోగ్రత, తీవ్రమైన సూర్యరశ్మి నుంచి మొక్కలను రక్షణకు షేడ్‌నెట్ నిర్మాణాలు ఉపయోగపడతాయి. కూరగాయల నారు, పూల మొక్కలు, అలంకరణ, నర్సరీ మొక్కలు, సున్నితమైన ఉద్యాన పంటల పెంపకానికి షేడ్‌నెట్ ఉపయోగకరంగా ఉంటుంది. అవసరాన్ని బట్టి నెట్‌లను ఎంపిక చేసుకోవాలి. అన్ని పంటలకు ఒకే రకమైన షేడ్‌నెట్ అనుకూలం కాదు. పంటకు అవసరమైన కాంతి, ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ పరిగణలోకి తీసుకుని వినియోగించాలి.

ప్లాస్టిక్ మల్చింగ్‌తో నీటి పొదుపు ఇలా..

పంటల వరుసల మధ్య నేలను ప్లాస్టిక్ మల్చింగ్ షీట్‌ను కప్పడం వల్ల ద్రవ నేలలోని తేమ ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. సూర్యరశ్మి నేరుగా నేలపై పడకుండా ఉండటం వల్ల నీటి ఆవిరి తగ్గి మొక్కలకు అవసరమైన తేమ ఎక్కువ కాలం అందుబాటులో ఉంటుంది. మల్చింగ్ షీట్ నేలను కప్పి ఉంచడంతో కలుపు మొక్కల పెరుగుదల తగ్గుతుంది. దీంతో కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చు. డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు ఫెర్టిగేషన్ విధానాన్ని మల్చింగ్‌తో అనుసంధానం చేస్తే నీరు ఎరువులను మొక్కల వేర్ల ప్రాంతానికి అందించవచ్చు. ప్లాస్టిక్ మల్చింగ్ ఖర్చు పంట రకం, షీట్ మందం, వెడల్పు, పొలం అమరిక, స్థానిక కూలీల ధరలను బట్టి మారుతుంది. సాధారణంగా 30-50 మైక్రాన్ మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తే ఎకరానికి రూ.12-22 వేల వరకు ఖర్చు అవుతుంది.

రాయితీతో రైతుకు లాభం..

ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షిత సాగు నిర్మాణాలకు రాయితీ అందిస్తున్నాయి. షేడ్‌నెట్, నెట్ హౌస్, పాలిహౌస్, లో టన్నెల్, వాక్-ఇన్ టన్నెల్, రక్షిత నర్సరీల నిర్మాణానికి రాయితీ పొందే అవకాశం ఉంది. రాయితీ శాతం యూనిట్ ఖర్చు, అర్హత, నిబంధనల ప్రకారం అందిస్తారు. నిర్మాణాలు అవసరమైన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తే మార్గదర్శకాలు వివరిస్తారు. నర్సరీ మొక్కల సాంద్రత, డ్రిప్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్, సమగ్ర పురుగు-తెగుళ్ల యాజమాన్యం పాటిస్తే లాభం ఉంటుంది.

సందేహం.. సమాధానం

? పత్తిలో వేరుకుళ్లు ఆశించి మొక్క ఎండిపోతుంది. నివారణ ఎలా. – పి.రమేష్‌రెడ్డి, మల్లారెడ్డిగూడెం

✔ వేరుకుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా, ప్లాంటామైసిన్ 0.3 గ్రా, లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల మొదట చుట్టూ పోయాలి.

? వరి పొలం వేసి 20 రోజులు అయింది. కాండం తొలిచే పురుగు నివారణకు చర్యలు ఏమిటి? – జి.లక్ష్మణ్, చిమిర్యాల

✔ కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు 25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

? బొప్పాయి సాగు చేయాలనుకుంటున్నాం. ఎప్పుడు నాటుకోవచ్చు. – డి.నాగేష్ మద్రిగూడ

✔ కొత్తగా బొప్పాయి నాటేందుకు ఆగస్టు, సెప్టెంబరు అనుకూలం. మొక్కల మధ్య 1.8 మీటర్ల దూరం ఉండేలా 40×40×40 సెం.మీ గుంతలు తీసి నాటుకోవాలి.

? బంతి మొక్కలు ఎప్పుడు నాటుకోవచ్చు. ఎన్ని రోజుల వయస్సు నారు నాటుకోవాలి. మొక్కలు ఎక్కడ దొరుకుతాయి. – పి.రవినాయక్, బీబీగూడెం

✔ బంతి మొక్కలు సెప్టెంబరు 15 వరకు నాటుకోవచ్చు. 25-30 రోజుల వయస్సు నారు నాటుకోవచ్చు. గడ్డిపల్లి కేవీకేలో నాణ్యమైన మొక్కలు లభ్యమవుతాయి.

కిరణ్ కుమార్

రైతులు వాట్సప్ ద్వారా అడిగిన సమస్యలకు గడ్డిపల్లి కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేలా కిరణ్‌కుమార్ సమాధానాలిస్తారు. -గరిడేపల్లి, న్యూస్‌టుడే:

78939 89055

ఎరువుల ఎంపిక విధానం ముఖ్యం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ రకాల పంటల్లో ఎరువుల ఎంపిక విధానం ముఖ్యమైందని కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచించారు. నత్రజని, అమ్మోనియం సల్ఫేట్, కాల్షియం నైట్రేట్ వంటివి ఎరువుల రూపంలో లభ్యమవుతాయి. నత్రజని రసాయన పరంగా యూరియా రూపంలో ఉంటుంది. ఇసుక పాళ్లు ఎక్కువగా ఉన్న మాగాణి భూముల్లో మినహా మిగతా అన్ని నేలలకు పంటలకు దుక్కిలో, దమ్ములో పైపాటుగా వేసుకోవచ్చు. ఆమ్ల భూములకు సల్ఫైడ్ ప్రమాదం ఉన్న భూములకు అమ్మోనియం సల్ఫేట్ వాడకూడదు. క్షార గుణం నేలలకు, సున్నపు నేలలకు ఎప్పుడైనా వేసుకోవచ్చు. కాల్షియం అమ్మోనియం నైట్రేట్‌ను వరి చిరు పొట్ట దశలో వేయాలి. ఫాస్పేట్ ఎరువుల్లో సూపర్‌ఫాస్పేట్ ప్రధానమైంది. ఇది సాధారణంగా అన్ని పైర్లకు వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువుల్లో అమ్మోనియం ఫాస్పేట్ అన్ని నేలలకు అన్ని పైర్లకు వాడవచ్చు. నైట్రోఫాస్పేట్లు మెట్ట ఆరుతడి పంటలకు ఎర్ర నేలలకు సాధారణ రసాయన స్థితిగల నేలలకు కొద్దిపాటి ఆమ్ల గుణం ఉన్న నేలలకు ఉపయోగపడుతుంది. నైట్రో ఫాస్పేట్ వరికి వేసుకోవచ్చు.

పశువులు సకాలంలో ఎదకు రావడానికి..

త్రిపురారం, న్యూస్‌టుడే: పశువులు సకాలంలో ఎదకు రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల పశువైద్యాధికారి నాగేంద్ర తెలియజేశారు. వర్షం, చలి కాలంలో సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న పశువులు ఎదకు వస్తాయి. 70 శాతం పశువులకు సమస్యలు ఉంటాయి. మొదట నట్టల మందు తాగించాలి. ఆల్‌బెండజోల్, ఫెన్ బెండజోల్ మందు తాగించాలి. పచ్చి గడ్డి అందుబాటులో ఉండేలా చూడాలి. ఒక పశువుకు 30 కిలోల పచ్చి గడ్డి ఒక రోజులో ఇవ్వాలి. మినరల్ మిక్చర్, మందులు ఇవ్వాలి.

ఆర్టీసీలో సంఘం ఎన్నికలకు కసరత్తు

నల్గొండ ఆర్టీసీ ప్రాంగణంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

భానుపురి, కుడకుడరోడ్డు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రకటన ఈ నెలాఖరులోగా విడుదల కానుంది. కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే నల్గొండ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ ప్రధాన సంఘాలన్నీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాయి. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోలలో టీఎంయూ, ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎన్‌ఎంయూ, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాలున్నాయి. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

డిపో	డ్రైవర్లు	కండక్టర్లు
దేవరకొండ	144	146
నల్గొండ	70	185
నార్కట్‌పల్లి	38	56
మిర్యాలగూడ	121	110
యాదగిరిగుట్ట	132	145
కోదాడ	114	98
సూర్యాపేట	55	208

గుర్తింపు ఇలా..: ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికే ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది.

త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలి...

–బత్తుల సుధాకర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి, నల్గొండ

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలంటే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతుంది. విలీన ప్రక్రియ త్వరగా పూర్తికావాలంటే ఆర్టీసీలో ఎన్నికలు త్వరగా జరగాలి. కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలి. పనిభారాలు తగ్గించాలి. సంస్థలో డిపో స్పేర్ విధానాన్ని ఎత్తివేయాలి.

మూడింటా లోటే

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటుతుంది. ఆగస్టు నెల సైతం ముగిసిపోయింది. కానీ ఉమ్మడి జిల్లాలో సరైన వర్షాలు మాత్రం కురవలేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గి అటు రైతులు, ఇటు సాధారణ ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31 నాటికి కురవాల్సిన దాని కంటే 30శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో మూడు జిల్లాలో లోటు వర్షపాతం కలిగిన జిల్లాల జాబితాలోనే నిలిచాయి.

◆ జిల్లాల వారీగా సోమవారం వరకు కురవాల్సిన, కురిసిన వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

జిల్లా	కురవాల్సింది	కురిసింది	తేడా(శాతంలో)
నల్గొండ	337.2	231.4	31.0
సూర్యాపేట	422.4	279.8	34.0
యాదాద్రి	375.9	245.5	35.0

✦ నల్గొండ జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉండగా కేతేపల్లి మండలంలో 70 శాతం తక్కువ వర్షపాతం నమోదుతో అధిక లోటు వర్షపాతం కలిగిన మండలాల జాబితాలో నిలవగా 23 మండలాల్లో లోటు వర్షపాతం, 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. దామరచర్ల మండలంలో మాత్రమే 3శాతం అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన అన్ని మండలాల్లో కురవాల్సిన దాని కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

✦ సూర్యాపేట జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉండగా 60 శాతం తక్కువ వర్షపాతంతో పాలకీడు మండలంలో అధిక లోటు వర్షపాతం నమోదైంది. 18 మండలాల్లో లోటు వర్షపాతం, నాలుగు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మఠంపల్లి మండలంలో 302.0 మిల్లీ మీటర్లకు అదే స్థాయిలో వర్షం కురవగా మిగిలిన అన్ని మండలాల్లో తక్కువ వర్షపాతమే నమోదైంది.

✦ యాదాద్రి జిల్లాలో 17 మండలాలు ఉండగా రెండు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అన్ని మండలాల్లోనూ కురవాల్సిన దాని కంటే తక్కువ వర్షపాతమే నమోదైంది.

హాయ్... పుస్తకాలు అందాయా..!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే సౌకర్యాలు వారికి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకతను తెలుసుకునే పనిలో రాష్ట్ర విద్యాశాఖ నిమగ్నమైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారా లేదా అనే విషయాలను విద్యాశాఖ అధికారులు తెలుసుకుంటున్నారు.

వర్క్ బుక్స్ మినహా...

ఉమ్మడి జిల్లాలో 1733 ప్రభుత్వ పాఠశాలల్లో 1,89,350 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరి తల్లిదండ్రుల చరవాణులకు మీ సేవ తెలంగాణ ద్వారా సందేశాలను పంపించి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. జిల్లాలో వర్క్ బుక్స్ మినహా మిగిలిన పాఠ్య, రాత పుస్తకాలు విద్యార్థులకు చేరాయి. అక్కడక్కడ కొంత కొరతగా నిలిచినా అధికారులు అవసరమైన పుస్తకాలను తెప్పించే ప్రయత్నాల్లో ఉన్నారు. పాఠశాలల్లోని సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశంలో ఆదేశించడంతో ఈ ప్రక్రియను మొదట చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రశ్నావళి రూపంలో...

పాఠ్య, నోట్ పుస్తకాలు అందాయా అంటూ ప్రశ్నావళి రూపం లో విద్యార్థుల తల్లిదండ్రుల చరవాణులకు వాట్సాప్ సందేశాలను పంపిస్తున్నారు. సందేశంలో విద్యార్థుల పేర్లు, తరగతి, పాఠశాల గ్రామం, మండలం పేరు వంటి పూర్తి వివరాలతో సం దేశాలు చేరవేస్తున్నారు. అయితే కొన్ని మాత్రమే అందాయి, పూర్తిగా అందలేదనే ఆప్షన్ల ద్వారా తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితమైన సమాధానాలు పంపితే భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకోనున్నారు.

వర్క్‌బుక్ రూపకల్పనలో మోత్కూరు ఉపాధ్యాయుడు

మేకల శశికుమార్

మోత్కూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) రూపొందించి, ప్రచురించిన 8వ తరగతి ఆంగ్ల వర్క్‌బుక్ రూపకల్పనలో మోత్కూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు మేకల శశికుమార్‌కు ఆంగ్ల కంటెంట్ డెవలపర్‌గా అవకాశం లభించింది. విద్యార్థుల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, అంతర్గతశక్తి అనే అంశాలను ప్రోత్సహించేలా శశికుమార్ రచించిన 'డిస్కవర్ ద ట్రెజర్ విత్ ఇన్ యూ' కవితను 8వ తరగతి వర్క్‌బుక్‌లో ప్రచురించారు. ఈ కవిత విద్యార్థులు తమలో దాగిఉన్న శక్తి, సామర్థ్యాలను అన్వేషించుకోవాలని ప్రేరణనిస్తుంది. శశికుమార్ రచన వర్క్‌బుక్‌లో ప్రచురితమైన సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై పురుగు మందు తాగి మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మిర్యాలగూడ మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామం దుర్గానగర్‌కు చెందిన కొమెర సైదమ్మ (39) పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేస్తూ మద్యానికి బానిసైంది. దీంతో భర్త గణేష్ ఎదుట తాగొద్దని వారించడంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు తక్షణమే ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అదే రోజు రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు సోమవారం అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

నిడమనూరు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని మాత్రలు మింగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...నిడమనూరుకు చెందిన గోగుల లింగయ్య కుమార్తె సుజాత(37)ను నార్కెట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వరికుప్పల కృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. కాగా వారి కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై ఆమె విరక్తి చెందింది. గత శుక్రవారం ఎల్లారెడ్డిగూడెం నుంచి నిడమనూరులోని ఆమె తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. వస్తూ మార్గమధ్యలో గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్లు సుజాత తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై ఆమె తండ్రి లింగయ్య సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తమిళనాడు సీఎంని కలిసిన ఎంపీ చామల

హైదరాబాద్, న్యూస్‌టుడే: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం చెన్నైలో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టడీ టూర్‌లో చామల పాల్గొన్నారు. అనంతరం సీఎం విజయ్‌ని కలిసి.. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల మధ్య పరస్పర సహకార అంశాలపై చర్చించారు.

తమిళనాడు సీఎం విజయ్‌తో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

పెండింగ్ ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలి

ఐక్యత చాటుతున్న అనురాధ, నరసింహారావు, సీతారాములు, జాన్‌వెస్లీ, జహంగీర్, వీరయ్య తదితరులు..

నల్లకుంట, న్యూస్‌టుడే: యాదాద్రి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత-చేవెళ్ల రీ డిజైన్ కారణంగా తిమ్మాపూర్, చౌక్లానాయక్ తండా, లప్పనాయక్ తండాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకోసం నష్టపరిహారం రూ.420 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.206 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొందన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి జహంగీర్, డీజీ.నరసింహారావు, కె.నరసింహ, అనురాధ, ఆర్.వెంకట్‌రాములు, సైల్కాబ్‌బాబు, పైళ్ల ఆశయ్య, వెంకటేశ్, బాలరాజు, మల్లేశం, పాండు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మోసపూరిత హామీలపై నిరసనలు'

మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి, భూపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలపై ఈ నెల 1 నుంచి 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారాస నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఈనెల 3న చేపట్టనున్న రైతు సదస్సుకు భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని చెప్పారు. పెద్ద ఎత్తున రైతులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, యడవల్లి శ్రీనివాసరెడ్డి, నాగార్జునచారి, చిట్టిబాబు నాయక్, బాలాజీ నాయక్, వీరకోటిరెడ్డి, సేవ్యా, చౌగాని భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బాలికకు గర్భం.. యువకుడిపై పోక్సో కేసు నమోదు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం కోదాడ పట్టణానికి చెందిన పదో తరగతి బాలిక గర్భిణి అయిన ఘటనపై విజయవాడ గవర్నర్‌పేట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాలికను వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు సోమవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆమె వయస్సు 15 సంవత్సరాలు, ఐదో నెల గర్భిణి కావడంతో ఆసుపత్రి సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆమెకు పరిచయమైన యువకుడే దీనికి కారణమని పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు చెప్పలేకపోవడంతో.. వారిచ్చిన సమాచారం మేరకు పోక్సో సెక్షన్ కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోదాడ బదిలీ చేశారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామానికి చెందిన బైరి యాదగిరి(43) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా సోమవారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకన్న, గ్రామస్థుల కథనం ప్రకారం.. యాదగిరి నిత్యం మద్యం మత్తులో ఉంటూ భార్యతో వాగ్వాదం పెట్టుకోవడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం రాత్రి ఇంట్లో ఒక్కడే ఉండటంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. యాదగిరి సోదరుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం ఘటనలో పదేళ్ల జైలు

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయి మూడవత్ మల్లేశ్‌కు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ నల్గొండ పోక్సో ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి విశ్వనాథ్‌కులకర్ణి దిలీప్‌రావ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. డిండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మూడవత్ మల్లేశ్ ఆటోలో పరిచయమైన మండలానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తూ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడి బెదిరింపులు భరించలేక బాలిక 2020 సెప్టెంబరు 8న పురుగుమందు తాగింది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకుంది. వైద్యుల పరీక్షలో బాలిక మూడు నెలల గర్భిణిగా తేలింది. నిందితుడు తనకు సంబంధం లేదని చెప్పడంతో డిండి పోలీసులు మల్లేశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. పోలీసులు దర్యాప్తు ముగించి ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. న్యాయస్థాన విచారణలో నేరనిర్ధారణ కావడంతో మల్లేశ్‌కు పదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానాను న్యాయమూర్తి విధించారు. చట్ట ప్రకారం ఆ బాలికకు రూ.ఏడులక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీ రంజిత్‌కుమార్ వాదించారు.

167 రహదారి ఎన్‌హెచ్‌ఏఐకి బదలాయింపు

కోదాడ నుంచి జడ్చర్ల వెళ్లే 167 రహదారి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: కోదాడ నుంచి మిర్యాలగూడ, హాలియా మీదుగా వెళ్లే జడ్చర్ల రహదారి(167)ని జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థకు బదలాయిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల మొదటి వారంలో గెజిట్ విడుదల చేశారు. ఇంతకాలం రోడ్డు విస్తరణ పనులు చేయించిన జాతీయ రహదారుల శాఖ పర్యవేక్షణ చేసేది. దాంతో పాటు గుత్తేదారుకు ఇచ్చిన ఐదేళ్ల నిర్వహణ గడువు ముగియడంతో ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజుల్లో సంబంధిత ఉన్నతాధికారుల సమక్షంలో అధికారికంగా నిర్వహణ బాధ్యతలను స్వీకరించనుంది. కోదాడ నుంచి జడ్చర్ల వరకు 234 కి.మీ రహదారిని 2017-18లో జాతీయ రహదారుల శాఖ విస్తరించింది.

గెజిట్ విడుదల...: ఇప్పటి వరకు కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో గుత్తేదారు పని చేశారు. రహదారిపై గ్రామాల పరిధిలోని సెంట్రల్ లైటింగ్, రోడ్ల నిర్వహణ బాధ్యతలను వారే నిర్వహించేవారు. నాలుగేళ్ల నిర్వహణ జూన్‌తో పూర్తి కావడంతో బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. దాంతో జులైలో అధికారులు రహదారిని పరిశీలించి అనంతరం ఆగస్టులో జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థకు బదలాయిస్తూ గెజిట్ విడుదల చేశారు. అంటే వారు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వీధి దీపాల బిల్లు, రోడ్డు నిర్వహణ చేపట్టనున్నారు. స్వల్పకాలిక నిర్వహణకు మరోసారి టెండర్ వేసి నాలుగు వరుసల రహదారి వేసే వరకు పొడిగిస్తూ నిర్వహణ చేపడతారు. గతంలో విస్తరణ సమయంలో 10 మీటర్ల తారు రోడ్డు వేశారు. గ్రామాల పరిధిలో పలుచోట్ల నాలుగు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రోడ్డును 100 అడుగుల మేర తీసుకున్నారు.

నాలుగు వరుసలకు ప్రతిపాదనలు...

ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉన్న 10 మీటర్ల రహదారిని నాలుగైదు ఏళ్లలో నాలుగు వరుసలుగా విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. 167 జాతీయ రహదారి పూర్తి దూరం సుమారు 483 కి.మీ. ఇందులో తెలంగాణలో 300 కి.మీ ఉండగా అందులో 2018లో విస్తరించిన జడ్చర్ల నుంచి కోదాడ వరకు 234 కి.మీ ఉంటుంది. ఈ మార్గంలో ఇప్పటికే గుడబెల్లూరు నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి టెం డర్ ప్రక్రియ పూర్తయి భూమి సేకరణ జరుగుతుంది. తర్వాత మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్లకు అనంతరం జడ్చర్ల నుంచి కోదాడకు మరో నాలుగైదు ఏళ్లలో నాలుగు వరుసల రహదారి వేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ పెరిగినందున త్వరలోనే నాలుగు వరుసల రోడ్డుకు నిధులు మం జూరు అవుతాయని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

EENADU eClassifieds

TO LET

సాయిభవాని జనరిక్&ఫార్మా మెడికల్&జనరల్ స్టోర్స్, రామగిరి, నల్లగొండ తక్షణం అద్దెకు/లీజుకు ఇవ్వబడును. (2-3 లక్షల స్టాక్ కలదు) మరియు 1-2 సంవత్సరాల అనుభవం గల ఫుల్/పార్ట్‌టైం సిబ్బంది కావలెను. 99859 24629.

DRIVERS

సూర్యాపేటలోఉండి కారు డ్రైవింగ్ అనుభవం ఉన్న డ్రైవర్ కావలెను. మంచిజీతం షెల్టర్ ఇవ్వబడును. సెల్:6300155438, 6300955438.

JOBS

ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నెలకు 20వేలు+ ఇన్సెంటివ్స్. మీ మండలాలలో, పట్టణాలలో పనిచేయాలి. ✆ 9866570239, 9347319131

నల్లగొండపట్టణంలో Climatop బ్రాండ్ క్లీనింగ్ ప్రొడక్ట్సునందు మార్కెటింగ్‌పర్సన్,ఆఫీసులో సేల్స్‌పర్సన్ కావలెను. Age:19-26. 9347745072.

నార్కట్‌పల్లి వద్దగల పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్ & బాయ్స్ కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర|| 99590 66588, 98854 12195.

సుధా బ్యాంక్ తిరుమలగిరి పట్టణ బ్రాంచ్, సూర్యాపేట జిల్లాలో క్లర్క్ కమ్ క్యాషియర్‌గా పనిచేయుటకు ఏదైనా డిగ్రీ మరియు కంప్యూటర్ నైపుణ్యం కలిగిన యువతి, యువకులు కావలెను. వెంటనే md@sudha.bank.inకు మీ బయోడేటా పంపగలరు. సెల్: 91333 72508.

Book Your 5 Lines Classified Advertisement for B/W 355/- COLOUR 440/- (GST 5% Extra) Contact 8008116681

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80081 16681
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 99080 16689

(c) eenadu

స్వామివారికి ప్రత్యేక అలంకరణ

నేరేడుచర్ల పట్టణంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శివప్రసాద శర్మ స్వామిని పూలతో అలంకరించారు. భక్తులు భారీగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రాచకొండ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నేరేడుచర్ల

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

సాగునీరు ఇవ్వాలని వినతి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వేములూరు ప్రాజెక్టు నుంచి సాగు నీరు ఇవ్వాలని భారాస నాయకుడు రఘు అన్నారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. అధికారుల సమన్వయ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రఘు

వ్యవసాయ విద్యతో ఉపాధి అవకాశాలు

వ్యవసాయ కళాశాల తరగతులను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ వేణుగోపాలరెడ్డి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: వ్యవసాయ విద్యతో విద్యార్థులకు పలు రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ వల్లా వేణుగోపాలరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ కళాశాల తరగతులను సోమవారం విశ్వ విద్యాలయం డీన్ కేవీ రంగారావుతో కలిసి ప్రారంభించారు. హుజూర్‌నగర్ వ్యవసాయ కళాశాలలో గత విద్య సంవత్సరంలో 37 మంది విద్యార్థులు చేరారని, ఈ సంవత్సరం కౌన్సెలింగ్ జరుగుతుందని, మరో 120 మంది విద్యార్థులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రూ.140 కోట్లతో కళాశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, 100 ఎకరాల్లో విద్యార్థులు వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కళాశాలకు 44 మంది ప్రొఫెసర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లింగయ్య, డీన్ కిరణ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో ప్రత్యేక పూజలు

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడ(బాలాజీనగర్), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో మెలగాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం బాలాజీనగర్‌లో శ్రీ మడేలయ్య స్వామి, సీతాలమ్మదేవి, ఈదలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాపుగల్లు, మంగళితండా, కూచిపూడిలో సోమవారం రూ.24 లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.20 లక్షల వ్యయంతో జీపీ భవనాన్ని ప్రారంభించారు. పలు శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలన్నారు. సర్పంచులు అప్పారావు, సంధ్య, గురవయ్య, సతీష్, సూర్యం, వెంకటేశ్వర్లు, శరభయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలేరు జలాశయం.. అన్నదాతలకు వరం

మోతె, న్యూస్‌టుడే: పాలేరు జలాశయం వెనుక జలాలు మండలంలోని ఎనిమిది గ్రామాల రైతులకు వరంగా మారాయి. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న మోతె మండలంలో జలాశయం బ్యాక్ వాటర్‌తో ఆయా గ్రామాల అన్నదాతలు సుమారు 5 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. ఖమ్మం, వరంగల్, సూర్యాపేట జిల్లాల నుంచి వచ్చే పెద్దేరు, చిన్నేరు వాగులు కూడలి గ్రామం వద్ద కలిసిపోయి వర్షాకాలంలో ఈ వరద పాలేరు జలాశయానికి వెళ్తుంది. ప్రస్తుతం వర్షాలు లేక పైన వాగులు ఎండిపోయాయి. కానీ ప్రస్తుతం జలాశయం వెనుక నీటితో మండల పరిధిలో దాదాపు పది కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న వాగులో పది అడుగుల లోతుతో నీరు ఉంది. వాగుకు ఇరువైపులా వేల ఎకరాల్లో ఈ వెనుక జలాలతో వర్షాకాలం, యాసంగి సీజన్‌లో వరి వేస్తారు.

జలాశయం నీటితో సాగు చేస్తున్న వరి..

వేల ఎకరాలకు ఈ నీరే ఆధారం..

ఆయకట్టేతర ప్రాంతమైన మోతె మండలం పాలేరు ఇరువైపులా ఆయకట్టు ప్రాంతంగా నిత్యం పచ్చని వరితో కనిపిస్తుంది. రంగాపురం తండా, నర్సింహపురం, తుమ్మగూడెం, నేరడవాయి, బోడబండగూడెం, అన్నారిగూడెం, ఉర్లుగొండ, రాయికుంట తండాకు చెందిన వందలాది రైతులు వేల ఎకరాల్లో వ్యవసాయానికి ఈ నీరు ఆధారంగా మారింది. ప్రస్తుత కరవు పరిస్థితుల్లో సాగు నీరు ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలేరు వాగుకు రెండు వైపులా ఎక్కడా పంట వేయని క్షేత్రం కనిపించదు. వాగులో మోటార్లు ఏర్పాటు చేసి కిలో మీటర్ల మేర రైతులు పైపులైన్ల ద్వారా నీరు తరలిస్తూ వరి సాగు చేయడంతో ఎటు చూసినా పచ్చగా కనువిందు చేస్తుంది.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు నామినేటెడ్ పదవుల్లో అన్యాయం జరుగుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పదవులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు గోవిందరావు, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, గంజి శివ, హనుమంతరావు, నిమ్మనగోటి శివకుమార్, బండి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

నడిగూడెం, న్యూస్‌టుడే: రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని తహసీల్దార్ ఎల్.మంగ కోరారు. సోమవారం నడిగూడెంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతుందని, అన్నదాతలు ప్రకృతి సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీవో మల్సూర్, సర్పంచి శ్రీనివాస్, ఏవో మల్సూర్, ఫౌండేషన్ నిర్వాహకులు ఎం.గోపయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

కోదాడలో బంద్ ప్రశాంతం

ద్విచక్ర వాహన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, నాయకులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: బాధితులపై పట్టణ సీఐ దాష్టీకానికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నేతృత్వంలో భారాస ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పట్టణ బంద్ ప్రశాంతంగా జరిగింది. గంధం కనకమ్మ డబ్బా దుకాణం తొలగించడంపై నిరసనగా దుకాణదారులు, విద్యా సంస్థలు బంద్ చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నివాసం నుంచి భారాస శ్రేణులు ద్విచక్ర వాహనాలపై పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఐ కోదాడకు వచ్చిన తర్వాత పట్టణంలో హింస, నేరాలు, దొంగతనాలు పెరిగాయని ఆరోపించారు. రాజకీయ ఆధిపత్యం కోసం ప్రజలను వేధించే పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. సీఐ చేసిన ప్రతి ఆరోపణను ఆధారాలతో రుజువు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 2న కోదాడ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో భారాస పట్టణాధ్యక్షుడు షేక్.నయీమ్, నరేష్, కరీముల్లాబాబా, భాస్కర్‌రావు, కిరణ్‌కుమార్, రమేష్, ఉపేందర్, శివాజీ, జానకిరామాచారి, ప్రదీప్, నర్సిరెడ్డి, సురేష్, మల్లయ్య, నాగయ్య, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బూరుగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ తల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ రైతులు ప్రభ బండ్లపై వెళ్లారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలను చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరారు. కార్యక్రమంలో సర్పంచి యరగాని రాధ, నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

80085 50363, 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడలోని హుజూర్‌నగర్ ఫ్లై ఓవర్ నుంచి ఉత్తమ్ పద్మావతి కాలనీకి వెళ్లే రహదారిలో చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తుంది. – విశ్వేశ్వరరావు, కోదాడ

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడ

? కోదాడ పట్టణంలోని ఎస్వీ కళాశాల పక్క వీధిలో వీధి దీపాలు లేవు. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి వేళ ప్రజలు అవస్థలు పడుతున్నారు. – భీంశెట్టి వెంకటేశ్వర్లు, కోదాడ

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే

? తాడ్వాయిలోని పలు వీధుల్లో మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టకపోవడంతో మురుగునీరు రహదారులపైకి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – కోల ఆంజనేయులు, తాడ్వాయి.

✔ త్వరలోనే మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. – రాము నాయక్, కార్యదర్శి.

బుల్లెట్ ట్రైన్ కోసం పోరాటం

మునగాల, న్యూస్‌టుడే: భావితరాలకు బాసటగా బుల్లెట్ ట్రైన్ కోసం ఉద్యమించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులలో సోమవారం ధర్నా నిర్వహించారు. తెలంగాణకు అన్యాయం చేస్తే పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి షేక్ సైదా, జిల్లా అధ్యక్షుడు చెమట లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పికెటింగ్

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ఎర్రగట్టు తండాలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. మూడు రోజుల కిందట తండాలో రెండు హత్యలు జరిగిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కాగా.. తండాలో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రత్యేక పోలీసు బలగాలతో పికెటింగ్ వారం పాటు కొనసాగుతుందని ఎస్సై నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు.

కూరగాయల ధరలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

టమాట 20, సొర 20, ఆలుగడ్డ 30, బెండ 30, క్యాబేజీ 30, దొండ 30, వంకాయ 40, గోకర 40, కాకర 40, బీర 30, పచ్చి మిర్చి 40, కీరా 40, క్యారట్ 50, బీట్‌రూట్ 50, కాప్సికం 80.

అల్లుకున్న నిర్లక్ష్యం

కోదాడ పట్టణంలోని 24వ వార్డులో విద్యుత్తు స్తంభానికి చెట్టు తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. నిత్యం విద్యుత్తు తీగలకు తగిలి మంటలు వస్తున్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగే అవకాశం ఉంది. సమస్యపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోదాడ పట్టణం

చెరువులను నీటితో నింపాలని డిమాండ్

మునగాల, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వపైన ఉన్న లిఫ్టుల ద్వారా గ్రామాల్లోని చెరువులు, కుంటలను నీరు విడుదల చేయాలని జమభారత లిఫ్టు ఇరిగేషన్ ఛైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. కొక్కిరేణి గ్రామంలో సోమవారం ఎల్ 30, 31 ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేశారు. లిఫ్టుల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు మోటార్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ములకలపల్లి రాములు, సర్పంచి దాసరి శ్రీను, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక జన్మదిన వేడుకలు

ఉద్యోగులను సన్మానించిన యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగులు జీవితాన్ని సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆగస్టులో జన్మించిన విశ్రాంత ఉద్యోగులకు సామూహిక జన్మదిన వేడుకలను స్థానిక సంఘం భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించిన పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ఆర్థిక కార్యదర్శి వీరబాబు, యూనిట్ కార్యదర్శి పందిరి రఘువరప్రసాద్, ఉపాధ్యక్షుడు యజ్ధాని, జానయ్య, భూపాల్‌రెడ్డి, షేక్.బాలేమియా, వెంకటరెడ్డి, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో ముత్యాలమ్మ జాతర

వివరాలు వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలో జరిగే ముత్యాలమ్మ జాతరను ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు జాతర కమిటీ ప్రకటించింది. పట్టణంలోని రామాలయం సెంటర్‌లో ముత్యాలమ్మ జాతర కమిటీ సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. 3న చల్లకుండ ఎత్తు కార్యక్రమంతో జాతరను ప్రారంభించనున్నారు. 6న పెద్ద ముత్యాలమ్మ తల్లి, 7న చిన్న ముత్యాలమ్మ తల్లి, 10న కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కులం పేరుతో రాజకీయాలు తగవు

కోదాడ, న్యూస్‌టుడే: కులం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని వ్యవసాయ మార్కెట్ ఛైర్ పర్సన్ ఏపూరి తిరపమ్మ అన్నారు. సోమవారం మార్కెట్ కార్యాలయంలో డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ దంపతులపై డబ్బా దుకాణాల వ్యవహారంలో అసత్య ఆరోపణలు చేస్తే సహించమని అన్నారు. గత ఎమ్మెల్యే పాలనలో బియ్యం, మట్టి, గంజాయి, ఇసుక దందాలకు అడ్డాగా ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ బషీర్, కోటయ్య, వెంకట్‌రెడ్డి, సూర్యం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఏపూరి తిరపమ్మ

రక్త పరీక్షల యంత్రం అందజేత

కోదాడ, న్యూస్‌టుడే: కోదాడ ప్రభుత్వ పశు వైద్యశాలలో పశువుల వైద్యానికి దాత ఉచితంగా రక్త పరీక్షల యంత్రం అందించారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ ఇండియా వీట్ ఫార్మా పశు ఔషధ కంపెనీ యజమాని ఎల్ల కృష్ణ తల్లిదండ్రులు లింగయ్య, లింగమ్మ పేరు మీదుగా రూ. 1,05,000 విలువైన రక్త పరీక్షల యంత్రం అందించారు. ఇలాంటి యంత్రం కేవలం కోదాడ ఆస్పత్రిలోనే ఉందని వైద్యుడు పెంటయ్య తెలిపారు. అనంతరం దాతను సన్మానించారు.

ధాన్యం నిల్వలతో అధిక లాభాలు

మాట్లాడుతున్న జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ మరియదాస్

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గిడ్డంగుల్లో ధాన్యం నిల్వ చేయడంతో రైతులు అధిక లాభాలను పొందవచ్చని జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ మరియదాస్ అన్నారు. సోమవారం లింగగిరిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు, వ్యాపారులకు, పప్పు మిల్లు యజమానులకు అవగాహన కల్పించారు. ధాన్యం నిల్వలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కట్టా గోపాల్‌రావు, సర్పంచి మేడి సునిత, రమణ, ఏఈవో షేక్ ముస్తాఫా, సంఘ కార్యదర్శి జనార్దన్‌రావు, రైతులు కడియాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలో పాత బస్టాండ్ నుంచి గాంధీ పార్క్ వరకు రహదారిలో ఉన్న ఎల్‌టీ లైన్‌ను సరి చేసేందుకు అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ ఏఈ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేసిన ఘటన అమరవరంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అమరవరం గ్రామానికి చెందిన చేపూరి రామారావు తన కంటి చికిత్స కోసం ఆగస్టు 22న హైదరాబాద్ వెళ్లారు. వైద్యం చేయించుకొని ఆదివారం ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక ఉన్న తలుపులను తెరిచి ఇంట్లో ఉన్న బీరువాను ధ్వంసం చేసి రూ.15 వేలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

సన్మానం... కోదాడ, న్యూస్‌టుడే: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికైనా కాంగ్రెస్ నాయకుడు కాంపాటి శ్రీనివాస్‌ను సోమవారం పట్టణంలో పలువురు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ బషీర్, గాలి శ్రీనివాస్, రమేష్, యేసయ్య, ఖాజా, మునీర్, తదితరులున్నారు.

2 నుంచి మండల స్థాయి క్రీడలు

పాలకవీడు, న్యూస్‌టుడే: పాలకవీడు జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 2, 3 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఇంజమూరి కాటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న బాలికలకు, 3న బాలురకు అండర్-14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించి డివిజన్ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

మునగాల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 3న మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పిడతల వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ సెక్రటరీ అజాం బాబా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థులు హాజరు కావాలని కోరారు

మేళ్లచెరువు, చింతలపాలెం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ పోటీలను ఈ నెల 2 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 2న అండర్-14, 17 బాలికలకు, అండర్-14 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 3న అండర్-17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు

పంటల సాగుపై డిజిటల్ సర్వే

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: మండలంలో పంటల సాగు వివరాలపై చేపట్టిన డిజిటల్ సర్వేను సోమవారం ఏవో జావేద్ పరిశీలించారు. వాలంటీర్లు రెవెన్యూ గ్రామాల వారీగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు నిర్మల, హిమబిందు, త్రివేణి పాల్గొన్నారు.



SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా // హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్ఏసిపిసి-1), కె.కె.టవర్స్, మొదటి అంతస్థు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా.

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారు మా బ్యాంకు నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యమును పొందియున్నారు. బ్యాంకుకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమంగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనములను స్వాధీనం చేసుకొని "ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే ఏది ఉన్నది ఉన్నట్లుగానే మరియు ఏది ఉంటే అది ఉన్నది ఉన్నట్లుగానే" వేలం ద్వారా దిగువ తెలిపిన తేదీన అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోన్ తాలూకు అసలు బకాయిసొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఇ-వేలమునకు ఆహ్వానించడమైనది.

వ. నెం.	ఋణగ్రహీత పేరు & ఖాతా నెం. & బ్రాంచి పేరు	వాహన వివరములు, రిజిస్ట్రేషన్ నెం., మోడల్	రిజర్వు ధర & ఇఎమ్‌డి	వేలం సమయం	వాహన వివరములకు సంప్రదించవచ్చు
1	షేక్ షరీన్ ఖాతా నెం. 43294014064 బ్రాంచ్ : గురునానక్ నగర్ (7955), విజయవాడ	VEHICLE NO: TG 29 A 5400 SKODA-KUSHAQ AMBITION MT 1.0 TSI - CANDY WHITE 2024 / PETROL ENGINE NO: DTB198424	Rs. 9,00,000/- & Rs. 90,000/-	10.00 AM to 4.00 PM	9182971727 Ratnam Sai

ఇ-వేలం తేది మరియు సమయం: 09-09-2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు

బిడ్ పెంపుదల: బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.1,000/- లతో గుణింపు ఆన్‌లైన్‌లో హెచ్చించవలెను.

నియమనిబంధనలు: (1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. (2) విజయవంతమైన పాటదారుడు బిడ్ మొత్తం మీద 15% మొత్తము వెంటనే చెల్లించవలెను, మిగిలిన సొమ్మును 7 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా ఇప్పటివరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. (3) వేలం వాయిదా వేయుటకు రద్దుచేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. (4) వాహనం రిజిస్ట్రేషన్ బాధ్యత విజయవంతమైన బిడ్డర్‌ది మాత్రమే మరియు రిజిస్ట్రేషన్ పేరు మారిన తరువాత మాత్రమే వాహనం ఇవ్వబడును. (5) వాహనం పార్కింగ్ యార్డు యొక్క అద్దె విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను. (6) ఇతర వివరములకు అధీకృత అధికారి, SBI, HLC-1 (RACPC-1), విజయవాడ, సెల్: 9424690028, 9182971727 సందు మరియు ఇ-వేలం కొరకు please visit https://baanknet.com సందు సందర్శించగలరు.

గమనిక: వాహనం యొక్క రిజిస్ట్రేషన్ పేరు మార్పునకు మరియు వాహనం యొక్క రిజిస్ట్రేషన్ ఛార్జీలు విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను. బ్యాంక్ వారికి ఎటువంటి సంబంధం లేదు. *షరతులు మరియు నిబంధనలు వర్తిస్తాయి.

తేది: 31-08-2026, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, SBI, RACPC-I, విజయవాడ

(c) eenadu

సూర్యాపేట
• సూర్యాపేట • తుంగతుర్తి

'వేతనాలు ఇవ్వడం తగదు'

భానుపురి, న్యూస్‌టుడే: ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రైవేటు వ్యక్తుల ఇళ్లలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ అధికారులు ఎలా వేతనాలు చెల్లిస్తున్నారని భాజపా రాష్ట్ర నాయకులు సంకినేని వరుణ్‌రావు ప్రశ్నించారు. సూర్యాపేటలోని పుర కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపి మాట్లాడారు. పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, నెలల తరబడి కాల్వల్లో పూడిక తీయడమే మర్చిపోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇళ్లలో పనిచేస్తున్న కార్మికులను స్వచ్ఛందంగా వెనక్కి పంపించాలని కోరారు. నాయకులు బూర లక్ష్మణ్, గోపి యాదవ్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలి

తిరుమలగిరిలోని 14వవార్డులో వీధులను పరిశీలిస్తున్న పుర ఛైర్మన్ రఘునందన్‌రెడ్డి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఇళ్ల మధ్య ఉండే ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల ఛైర్మన్ సంకేపల్లి రఘునందన్‌రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరిలోని 14వ వార్డులో పలు వీధులను పుర సిబ్బందితో కలిసి పరిశీలించారు. వర్షాకాలం పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, పుర సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

మద్దిరాల, న్యూస్‌టుడే: రైతులు పండ్ల తోటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందేలా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బృందం నాయకుడు మురళి, డీఆర్‌డీవో సన్యాసయ్య అన్నారు. మండలంలోని ముకుందాపురం, జీ.కొత్తపల్లిలో ఉపాధి పనులలో భాగంగా చేపట్టిన పాంపౌండ్, మామిడి తోటలు, వివో భవనాలను సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో కేంద్ర ప్రభుత్వం కల్పించే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఏపీడీ చంద్రశేఖర, ఎంపీడీవో మారుతి సత్యనారాయణరెడ్డి, ఏపీవో వెంకన్న, ఈసీ చారి, టీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

జీ.కొత్తపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

క్షేత్రపరిశీలన.. నూతనకల్: మండలంలో నిర్వహిస్తున్న వీబీజీ రామ్‌జీ పనులను రాష్ట్ర పరిశీలన బృందం సోమవారం క్షేత్ర పరిశీలన చేసింది. నూతనకల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన రూఫ్ టాప్ హర్వస్టింగ్ స్ట్రచ్చర్‌ను పరిశీలించి బాగుందని అధికారులను కొనియాడారు. అనంతరం పనుల గుర్తింపుపై అంతర్జాలంలో నమోదును ఎంసీవో గదిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర పరిశీలన బృందం ఎస్‌పీఎం మురళి, డీఆర్‌డీవో సన్యాసయ్య, అడిషనల్ పీడీ చంద్రశేఖర్, ఎంపీడీవో సునిత, ఏపీవో శ్రీరాములు, ఎంపీవో హరిసింగ్, సాంకేతిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు బెల్లంకొండ

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని నెమ్మికల్‌కు చెందిన సాయుధ పోరాట యోధుడు బెల్లంకొండ సత్తయ్య 18 వర్ధంతిని కుటుంబ సభ్యులు, నాయకుల సమక్షంలో సోమవారం నిర్వహించారు. ఆయన స్మారక స్తూపం వద్ద పెద్ద కుమారుడు, సీపీఎం సీనియర్ నాయకుడు బెల్లంకొండ చక్రయ్య జెండాను ఆవిష్కరించారు. భారాస, సీపీఎం, భాజపా నాయకులు యాదగిరి, వెంకన్న, పర్వతాలు, బాలస్వామి, యల్లయ్య, భాగ్యమ్మ, రవి, తదితరులు పాల్గొన్నారు.

నెమ్మికల్‌లో బెల్లంకొండ సత్తయ్య స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కుటుంబ సభ్యులు

తహసీల్ నిర్మాణ స్థలం ఎంపికపై వినతి

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: తహసీల్ కార్యాలయ భవనం ఎక్కడ నిర్మించనున్నారో స్పష్టత ఇవ్వాలని కోరుతూ మండలానికి చెందిన పలువురు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పాల్వాయి పరశురాములు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. మండలంలో కార్యాలయాల నిర్మాణానికి సరిపడే ప్రభుత్వ భూమి ఉందని.. మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించాలని అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. భాజపా జిల్లా కార్యవర్గ సభ్యులు సాగర్, బీఎస్పీ మండల అధ్యక్షుడు ఉపేందర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్‌లో.. నూతనకల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సునిత పర్యవేక్షణలో శాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 5 దరఖాస్తులు అందాయి. వెంకేపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులకు ఐదేళ్లుగా పింఛన్ అందిస్తున్నారని ఒకరు, రెవెన్యూ భూసమస్యలు పరిష్కరించాలని ముగ్గురు రైతులు, నూతనకల్ జడ్పీ పాఠశాల గేటు వద్ద మహిళా ప్రయాణికులకు మూత్రశాలలు నిర్మించడానికి అనుమతించాలని సర్పంచి మహేశ్వరం మల్లికార్జున్ ఫిర్యాదు అందించారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వివరించారు.

జిమ్ముల నిర్వహణపై.. కిమ్మనరు!

ఆత్మకూర్(ఎస్)లోని బహిరంగ వ్యాయామశాల

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: గ్రామాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామశాల(ఓపెన్ జిమ్)ల నిర్వహణ సక్రమంగా లేక అస్తవ్యస్తంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో వీటిని ప్రతి మండలంలో, కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేశారు. వీల్, చెస్ట్‌ప్రెస్, క్రాస్ వాకర్, హార్స్‌రైడర్ తదితర వ్యాయామ పరికరాలను జిమ్‌లో సమకూర్చారు. ప్రస్తుతం ఇవి నిరాదరణకు గురవుతున్నాయి. మ్యాట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన కొద్ది రోజుల్లోనే చోరీ చేశారు. జిమ్‌ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసినా.. కొద్ది నెలలకే మాయం చేశారు. అధికారులు పర్యవేక్షణ చేసినప్పటికీ వాటిని ఎలా ఉపయోగించుకోవాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్థం కాకపోవడం, అవగాహన లేకపోవడం సమస్యగా మారింది. అధికారులు స్పందించి జిమ్ పరికరాలను ఎలా ఉపయోగించుకోవాలో శిక్షకుల ద్వారా కనీసం వారం రోజులు శిక్షణ ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుందని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

★ ఆత్మకూర్(ఎస్) మండలంలోని దాదాపు అన్ని పాత గ్రామ పంచాయతీల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల పాటు బాగానే ఉన్నా.. ఆ తర్వాత నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. రాత్రి వేళల్లో మద్యం తాగడం, తాగిన సీసాలను జిమ్ ఆవరణలోనే పగలగొట్టి గాజు ముక్కలతో నింపుతున్నారు.

జిమ్ ఆవరణలో పగలగొట్టిన మద్యం సీసాల ముక్కలు

దృష్టి సారిస్తాం: ప్రియాంక, ఎంపీవో, ఆత్మకూర్(ఎస్)

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై దృష్టి సారిస్తాం. తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శులతో చర్చిస్తాం. తగిన మరమ్మతులు, నిర్వహణ సక్రమంగా చేయాల్సిందిగా ఆదేశాలు ఇస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

సూర్యాపేట: 9154395978, తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌లో పైపులైన్లు పగిలిపోవడంతో నీటి సరఫరా జరగక తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుర అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. – భీక్షం

✔ పైపులైన్లకు మరమ్మతు చేపట్టి నీటి సమస్య లేకుండా చూస్తాం. – హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రిపూట అంధకారం నెలకొని కాలనీవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. – భాస్కర్

✔ సిబ్బందికి చెప్పి వెలిగేలా చూస్తాం. – రాజిరెడ్డి, పుర ఏఈ, సూర్యాపేట

స్పందనకు వందనం

సూర్యాపేట పురపాలిక, భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలోని పలు సమస్యలపై స్థానికుల సమాచారం మేరకు 'మేమున్నాం..మీకుతోడు'గా శీర్షికలో ఈ నెల 31న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు సంబంధిత అధికారులు స్పందించారు. ★ సూర్యాపేటలోని జాతీయ రహదారి నుంచి చింతల చెరువు వెళ్లే సీసీ రోడ్డు గుంతలమయంగా మారడంతో పుర అధికారులు పరిశీలించి పూడ్చివేయాలని సిబ్బందికి సూచించారు. ★ సూర్యాపేటలోని తిలక్‌నగర్‌లో మురుగు కాల్వల్లో పారిశుద్ధ్య సిబ్బంది పూడిక తీశారు.

'ప్రజల ఆకాంక్ష క్షీణించిపోతుంది'

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: కేంద్రం ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి మీదుగా వెళ్లాలన్న సూర్యాపేట ప్రజల ఆకాంక్ష రోజురోజుకు క్షీణించిపోతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పెద్దిరెడ్డి రాజా, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుల్లెట్ రైలు సాధన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 18 రోజులు రిలే నిరాహార దీక్షలు రజక ఐకాస నాయకులు సట్టు నాగయ్య సారథ్యంలో సోమవారం రజకులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. దీక్షకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాచకొండ దేవయ్య, లక్ష్మయ్య, లింగయ్య, హుస్సేన్, గుండారపు శ్రీను, పగిళ్ల వెంకన్న, తాడూరి పద్మ, ఎల్లమ్మ, రేణుక, సంధ్య, గంగరాజు, శ్రీను పాల్గొన్నారు.

సూర్యాపేట: దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పెద్దిరెడ్డి రాజా

పనుల గుర్తింపుపై గ్రామసభలు

నూతనకల్: వీబీజీ రాంజీ పథకం కింద కూలీలకు పనిదినాలు కల్పించడానికి పనుల గుర్తింపుపై సోమవారం నూతనకల్, యడవెల్లి, తాళ్లసింగారం గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో సునిత, ఈసీ లక్ష్మయ్యలు పాల్గొని సూచనలు అందించారు. సర్పంచులు మహేశ్వరం మల్లికార్జున్, జటంగి సరిత, జటంగి నాగలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శులు శర్మ, చలమయ్య, వెంకన్న, సాంకేతిక అధికారులు స్వరూప, శ్యామల క్షేత్ర సహాయకులు అరుణ, లింగయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ లీకేజీ.. ఇళ్ల మధ్య మురుగు

సూర్యాపేటలోని భగత్‌సింగ్‌నగర్‌లో మార్కెట్ రోడ్డుకు వెళ్లే మార్గంలో భూగర్భ మురుగు కాల్వకు ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌కు లీకేజీ ఏర్పడింది. మురుగు ఖాళీ స్థలంలోకి పారుతోంది. చుట్టుపక్కల ఇళ్ల మధ్యన నిల్వ ఉండటంతో దుర్వాసన కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ ప్రజారోగ్య అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రోజుల తరబడి వరద పారి నివాసాల పక్కన నిల్వడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ విషయమై ప్రజారోగ్య డీఈ అనిల్‌ను వివరణ కోరగా వెంటనే మరమ్మతు చేయించి మురుగు పారకుండా చూస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, సూర్యాపేట పురపాలిక

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నాగారం, న్యూస్‌టుడే: మంచిర్యాలలో ఈ నెల 8, 9లలో జరిగే అఖిల భారత రైతుకూలీ సంఘం తొమ్మిదో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంపెట కాశయ్య అన్నారు. డి కొత్తపల్లిలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ నాయకుల ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. నాయకులు లింగయ్య, సుధాకర్‌రెడ్డి, కొమరయ్య, కృష్ణమూర్తి, వీరాచారి, నరేశ్, గోవర్ధన్, రమేశ్, సైదులు, సిద్దు, పరంధాములు, యాదయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండున్నరేళ్లు అధ్యక్షులు వీరే: ఎమ్మెల్యే

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తుంగతుర్తి నియోజకవర్గంలో పీసీసీ నియమించిన పార్టీ మండల అధ్యక్షులు పదవి కాలం పూర్తయ్యేంత వరకు కొనసాగుతారని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. అర్వపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి.. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రాణం ఉన్నంత వరకు నియోజకవర్గాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రమేశ్, విక్రమ్‌రెడ్డి, అవిలయ్య, విద్యాసాగర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలోని బహిరంగసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ప్రజావాణి వినిపించడం లే!

ప్రజావాణిలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

తుంగతుర్తి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నోడల్ అధికారి నేతృత్వంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రజలకు ఏమైనా సమస్యలుంటే ప్రజావాణి ద్వారా దరఖాస్తులను సమర్పిస్తే నోడల్ అధికారి ఆ సమస్య ఏమిటో గుర్తించి సంబంధితశాఖ అధికారి ద్వారా పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్నారు. కానీ ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరవైంది.

● మొదటి వారంలో మండలానికి పది వరకు దరఖాస్తులు రాగా మూడో వారికి అది ఒకటి రెండుకు పడిపోయింది. దీంతో కార్యక్రమ లక్ష్యం నెరవేరకుండా పోతుందనే భావన వస్తుంది. గతంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకునే వారు.. కానీ దానివల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వారిని జిల్లా కేంద్రానికి రాకుండా స్థానికంగా దగ్గరలో సమస్య పరిష్కరించే వెసలుబాటును కల్పించారు. కానీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోగా.. సుమారు అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో ఉండటంతో వారి సమయం వృథా అవుతోందనే భావం వ్యక్తమవుతుంది. తుంగతుర్తి సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో జరిగిన ప్రజావాణిలో కేవలం 18 దరఖాస్తుల మాత్రమే వచ్చాయి.

మండలం	వచ్చిన దరఖాస్తులు
తుంగతుర్తి	2
తిరుమలగిరి	4
మద్దిరాల	1
నాగారం	6
నూతనకల్	5
జాజిరెడ్డిగూడెం	0

సమస్యల వలయంలో గిరినగర్

గిరినగర్‌లో మట్టి రహదారి దుస్థితి

సూర్యాపేట పట్టణంలోని గిరినగర్‌లో సమస్యలు తిష్టవేశాయి. కాలనీలో 350 నివాసాలు ఉండగా.. 1300 మంది నివాసముంటున్నారు. పురపాలికలకు వివిధ రకాల పన్నులు చెల్లిస్తున్నా.. అభివృద్ధికి మాత్రం నిధులు కేటాయించటం లేదు. గిరినగర్ కాలనీలో సరైన రహదారులు అధ్వానంగా మారాయి. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్నా.. మట్టిరోడ్లు సీసీగా మారడం లేదు. పలుచోట్ల రోడ్లు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి మట్టి రోడ్డు చిత్తడిగా మారడంతో పాటు గుంతలు పడుతున్నాయి. ఇళ్లలోని మురుగు ఖాళీ స్థలాల్లోకి పారుతోంది. దోమలు స్వైరవిహారం చేయడంతో చీకటిపడితే చాలు ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొంది. దీనికితోడు పలుచోట్ల వీధి దీపాలు వెలగటం లేదు. ఈ విషయమై పుర కమిషనర్ హన్మంతరెడ్డిని వివరణ కోరగా.. నిధుల లభ్యతను బట్టి వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, భానుపురి

రోడ్ల పక్కన వ్యాపారం.. రాకపోకలకు అంతరాయం

సూర్యాపేటలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద వాహనాలు నిలిచి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. జాతీయ రహదారి నుంచి అండర్ పాస్ నిర్మాణం చేపట్టడంతో విద్యానగర్, శ్రీరాంనగర్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు వసుంధర షాపింగ్ మాల్ పక్క వీధి రోడ్డు నుంచి శ్రీరాంనగర్‌కు వెళ్తుంటారు. ఈ మార్గం పక్కనే కూరగాయలను తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగిస్తున్నారు. వినియోగదారులు వచ్చి వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి కూరగాయలు ఖరీదు చేస్తుండటంతో రద్దీ నెలకొని వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ కారణంగా అర్ధగంటపాటు రోడ్డు దాటాలంటేనే నరకయాతన పడుతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ హన్మంతరెడ్డిని వివరణ కోరగా వ్యాపారులతో మాట్లాడి నిర్వహణ చేపట్టకుండా చూస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, భానుపురి

పోస్టుకార్డులతో నిరసన

పోస్టుకార్డులు చూపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థినులు

సూర్యాపేట పట్టణం: పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న శక్తి స్కీమ్ వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు బంటు సందీప్ డిమాండ్ చేశారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు విద్యార్థులతో కలిసి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపి నిరసన వ్యక్తం చేశారు. ఉదయ్, నవనీత్, వినయ్, వంశీ, సాయి, మహేందర్, వెంకట్ పాల్గొన్నారు.

జీవోను రద్దు చేయాలి.. భానుపురి: రాష్ట్ర ప్రభుత్వం శక్తి పథకం జీవో నం.97 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేటలోని తపాలా కార్యాలయం వద్ద పాలిటెక్నిక్ విద్యార్థినులతో కలిసి బీఆర్‌ఎస్వీ నాయకులు సోమవారం సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఈ పథకం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల విద్య, భవిష్యత్తు అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. వెంటనే పునరాలోచన చేసి రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సందీప్, ఉదయ్, నవనీత్, వినయ్, వంశీ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చొద్దని వినతి

భానుపురి, న్యూస్‌టుడే: శంషాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా చెన్నైకి ప్రతిపాదించిన బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ను మార్చొద్దని, మొదట ప్రతిపాదించిన విధంగానే జాతీయ రహదారి 65 వెంబడి కొనసాగించాలని భాజపా సీనియర్ రాష్ట్ర నాయకులు సంకినేని వెంకటేశ్వరరావు సోమవారం హైదరాబాద్‌లో భాజపా అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో బుల్లెట్ రైలును సాగర్, హాలియా వైపు తిప్పి, సూర్యాపేట, నార్కట్‌పల్లి లాంటి ప్రధాన పట్టణాలకు అన్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్పు తీసుకొచ్చిందని సంకినేని ఆయనకు వివరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా రైల్వేలైన్ వచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. స్పందించిన మహేశ్వర్‌రెడ్డి కేంద్ర రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్తానని భరోసా కల్పించారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చలమల్ల నర్సింహ, పీఎం విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ సలిగంటి వీరేందర్ ఉన్నారు.

ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంకినేని వెంకటేశ్వరరావు, నర్సింహ, వీరేందర్

నాగారం(బంగ్లా)లో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ గుంటకండ్ల ముకుందారెడ్డి, తదితరులు

నాగారం: హైదరాబాద్ నుంచి అమరావతికి వెళ్లే బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్చకుండా సూర్యాపేట మీదుగా వేయాలని కోరుతూ మాజీ సింగిల్‌విండో ఛైర్మన్, సీనియర్ సిటిజన్ల సంఘం సూర్యాపేట డివిజన్ అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో అంజిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితికి తమ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్ల సంఘం నాయకులు సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యాక్టరీని జనావాసాలకు దూరంగా తరలించాలి'

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: సూర్యాపేట పుర పరిధిలోని ఓ ఫార్మా ఫ్యాక్టరీని వెంటనే జనావాసాలకు దూరంగా తరలించాలని, ఫ్యాక్టరీ అక్రమ అనుమతులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ. . వాయు కాలుష్యం, జల కాలుష్యం జరుగుతుందని, వీటి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వెంకన్న, అఖిల్, నాగయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పంటలకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయలు) ఇలా ఉన్నాయి.

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3749	2809
జైశ్రీరాం	4009	2605
ఐఆర్-64	2323	2323
హెచ్ఎంటీ	2661	2661
కందులు	7943	6894
పెసర	6799	3893
మొక్కజొన్న	1742	1742
వేరుసెనగ	6859	6869
ఉలవలు	7322	7322
బొబ్బర్లు	2226	2226

సకాలంలో చేరని సన్నాలు..

యడవెల్లిలో రేషన్ దుకాణం వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్ మండలంలోని కొన్ని గ్రామాల రేషన్ దుకాణాలకు సకాలంలో గోదాం నిర్వాహకులు బియ్యం చేరవేయకపోవడంతో లబ్ధిదారులకు సన్నబియ్యం అందనిద్రాక్షలా మారుతోంది. ఎలాగైనా తమ కోట బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు రాత్రివరకు నిరీక్షించాల్సి వస్తుంది. నూతనకల్-1, యడవెల్లి రేషన్‌దుకాణాలను సోమవారం 'న్యూస్‌టుడే' పరిశీలించగా.. గోదాం నిర్వాహకులు బియ్యం చేరవేయడంలో నిర్లక్ష్యం కనిపించింది. యడవెల్లి రేషన్ దుకాణం కింద 790 రేషన్‌కార్డులున్నాయి. ప్రతి నెల సుమారు 80 క్వింటాళ్ల బియ్యం లబ్ధిదారులకు అందిస్తుంటారు. మూడు నెలల కోటా ఒక్కసారి అందించాలంటే 240 క్వింటాళ్లు కావాల్సి ఉంది. గత నెల పంపిణీ చేయగా రేషన్ దుకాణంలో 33 కేజీల బియ్యం నిల్వ ఉంది. ప్రతినెల 3వ తేదీ లోపు రేషన్ దుకాణాలకు గోదాం నుంచి బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. ఈ నెల 22న 120 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేశారు. మూడు రోజుల్లో బియ్యం నిండుకోవడంతో లబ్ధిదారులు రేషన్‌దుకాణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ నెల 29న 120 క్వింటాళ్ల తిరిగి సరఫరా చేయడంతో లబ్ధిదారులు మూడు రోజులుగా రేషన్ కోసం కుస్తీపట్లు పట్టాల్సి వచ్చింది. ఒక్కో లబ్ధిదారుడికి మూడు పర్యాయాలు వేలిముద్రలు నమోదు చేయాల్సి ఉండగా.. 10 నుంచి 12 నిమిషాలు సమయం పడుతోంది. తెల్లవారితే గడువు ముగుస్తుండటంతో సోమవారం రాత్రి 8 గంటల వరకు లబ్ధిదారులు రేషన్ దుకాణాల ఎదుట నిరీక్షిస్తూ గడిపారు. సకాలంలో దుకాణాలకు బియ్యం చేరవేస్తే తమకు ఇంతకష్టం ఉండేదికాదని అభిప్రాయపడుతున్నారు. ఇది నూతనకల్ మండలంలోని ఎక్కువ రేషన్ దుకాణాల్లో కనిపించే గోదాం అధికారుల అలసత్వానికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి.

అవీ ఇవీ

సన్మానం.. పెన్‌పహాడ్: మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు బొల్లెద్దు నరేందర్ ఉద్యోగ విరమణ సన్మానోత్సవాన్ని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నల్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఎంఈవో ఎన్.రవి, సర్పంచి ఒగ్గు కిరణ్‌కుమార్ తదితరులు ఆయనను సన్మానించారు. అనంతరం స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎం రవీంద్రబాబు, సంఘం మండల ప్రధాన కార్యదర్శి వినోద్, శివశంకర్, దయాకర్, గవాస్కర్, వెంకటయ్య, సత్యనారాయణ, భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి.. నాగారం: ఫణిగిరి గ్రామానికి చెందిన నియోజకవర్గ ఆత్మకమిటీ ఛైర్మన్ పానుగంటి నర్సింహారెడ్డి మామ ముదిరెడ్డి సంజీవరెడ్డి సోమవారం మృతి చెందారు. సర్పంచి ఎర్ర సావిత్రి, యాదగిరి దంపతులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కసిరెడ్డి రాంరెడ్డి, ఉప సర్పంచి భానుప్రకాశ్, దేవాలయ కమిటీ ఛైర్మన్ లక్ష్మీకాంత్, కరుణాకర్, సత్తయ్య, రవి, అవిలయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి.. నూతనకల్, న్యూస్‌టుడే: రైతులు తమ సాగు భూమిలో సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని తాళ్లసింగారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి సాయి ప్రసాద్ పేర్కొన్నారు. యడవెల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం రైతుల నుంచి వివరాలు సేకరించి పంటల సాగును అంతర్జాలంలో నమోదు చేశారు. ప్రతి రైతు తమ సాగు భూమిలో సర్వే నంబరు ప్రకారం పంటల వివరాలు వివరించాలని కోరారు.

సినిమాలు

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే:

నవ్య - ఇరుముడి
ఈశ్వర్ సినిమాస్ - టాక్సిక్
తిరుమల మల్టీప్లెక్స్ - ఇరుముడి, విశ్వనాథం అండ్ సన్స్, టాక్సిక్

హాస్పిటల్ లో పనిచేయుటకు కావలెను
◆ రిసెప్షనిస్ట్
◆ స్టాఫ్ నర్సులు
పూర్తి వివరాలకు
829 777 3108
సూర్యాపేట
sri.1994.n@gmail.com

(c) eenadu